క్లుప్తంగా

అక్కచెల్లెమ్మల జీవనోపాధికి చేయూత



భవానీపురం(విజయవాడపశ్చిమ):మహిళా సాధికారతలో భాగంగా అక్కచెల్లెమ్మలకు జీవనోపాధి కల్పించేందుకు 'వైఎస్సార్ చేయూత' పథకం తోడ్పాటునిస్తుందని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం 43వ డివిజన్ హౌసింగ్‌బోర్డ్‌కాలనీ లోగల వీఎంసీ కల్యాణమండపంలో గురువారం లబ్ధిదారులకు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మేయర్ భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి ఆసిఫ్ కలిసి అన్ని డివిజన్లలోగల 9738 మంది లబ్ధిదారులకు రూ.18,25,87,500 చెక్కును అందచేశారు. కార్యక్రమంలో ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, గుడివాడ నరేంద్ర రాఘవ, యరడ్ల ఆంజనేయరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, బాపతి కోటిరెడ్డి, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, అర్షద్, పార్టీ నాయకులు మైలవరపు దుర్గారావు, మెప్మా ఉద్యోగులు పాల్గొన్నారు.

శివతత్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):మహా శివరాత్రిని పురస్కరించుకుని ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై శివతత్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదికపై డాక్టర్ పాలవర్తి శ్యామలానంద ప్రసాద్ మహా శివరాత్రి పర్వదినం విశిష్టత, పరమశివునికి పూజ విధానంతో పాటు శివలీలను చక్కటి వ్యాఖ్యానంతో ప్రవచనం చేశారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని కొత్తపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వించిపేట ప్రాంతంలో ఎస్ఐ ఎల్. దేవసుధ గస్తీ నిర్వహిస్తుండగా గౌస్‌మొహిద్దీన్ వీధిలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఆరా తీయగా భవానీపురం ప్రాంతానికి చెందిన షేక్. షరీఫ్‌గా గుర్తించారు. నిందితుడి వద్ద లభించిన సంచిలో 10 బీర్ బాటిల్స్, 10 క్వార్టర్ బాటిల్స్‌ను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఉత్తర్వుల ప్రకారం ఆర్‌పీఎఫ్ పోలీసుల సమన్వయంతో జీఆర్‌పీ పోలీసులు విజయవాడ రైల్వే స్టేషన్‌లో గంజాయి, మద్యం, డబ్బు, బంగారం అక్రమ రవాణపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా జీఆర్‌పీ సీఐ పి.శ్రీనివాస్, ఆర్‌పీఎఫ్ సీఐ టి.చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బందితో 7వ నెంబర్ ప్లాట్‌ఫాంపై తనిఖీలు చేస్తుండగా ఒరిస్సా రాష్ట్రం, ఖర్దా గ్రామానికి చెందిన సల్మాన్‌ఖాన్ (27) అనే యువకుడి బ్యాగులో 20 కేజీల గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశారు.

మైనర్ అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):మైనర్ అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టినగర్ ఎర్రకట్ట రోడ్డులోని లౌక్య బార్ సమీపంలో గంటపల్లి పావని, లక్ష్మీకాంత్‌రెడ్డిల కుటుంబం నివాసం ఉంటుంది. వీరికి ఇద్దరు సంతానం. పావని కేర్ టేకర్‌గా తిరుపతిలో పని చేస్తుండగా, విజయవాడలోని ఇంట్లో కుమార్తె (15)తో పాటు కుమారుడు మురళీరెడ్డి (23) ఇద్దరే ఉంటారు. మురళీరెడ్డి మార్కెట్‌లోని ఓ డ్రైఫ్రూట్స్ దుకాణంలో పని చేస్తుండగా, బాలిక 9వ తరగతి చదువుతుంది. 6వ తేదీ రాత్రి అన్నాచెల్లెలిద్దరు భోజనం చేసి నిద్రపోయారు. ఉదయం లేచి చూసే సరికి ఇంట్లో బాలిక కనిపించలేదు. బయట తలుపుకు గడియ పెట్టి ఉండటంతో మురళీ పక్క ఇంటి వారిని పిలిచి తలుపు గడియ తీయించాడు. బయటకు వచ్చి చూసి చేసే సరికి చెల్లి కనిపించకపోవడంతో వెంటనే తిరుపతిలో ఉన్న తల్లిదండ్రులకు విషయం చెప్పాడు. దీంతో నగరానికి చేరుకున్న పావని తన కుమార్తె కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రెండేళ్ల చిన్నారితో తల్లి అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):షాపునకు వెళుతున్నానని చెప్పి రెండేళ్ల చిన్నారితో సహా తల్లి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ జెండాచెట్టు ప్రాంతానికి చెందిన విపుల్ జోషి, ఆషాలు భార్యాభర్తలు. వీరికి ఒక బాబు ఉన్నాడు. రెండు రోజుల కిందట భార్యాభర్తలిద్దరికి చిన్న గొడవ జరిగింది. గురువారం మధ్యాహ్నం ఆషా బాబును తీసుకుని వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది

- టీడీపీ–జనసేన కూటమి మాటలు నమ్మొద్దు
- పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



39వ డివిజన్‌లో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):'నిత్యం ప్రజల్లోనే ఉంటున్నాం.. కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశాం.. సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చాం.. కచ్చితంగా ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది' అని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ స్పష్టం చేశారు. గురువారం పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 39వ డివిజన్‌లో గడప గడపకు మన ఆసిఫ్ కార్యక్రమం నిర్వహించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవతో కలిసి పలు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సిమెంట్ రోడ్డు, కొండపల్లి వారి వీధి, జోహార్ వారి స్ట్రీట్, శంక వారి వీధి. లొల్ల వారి వీధుల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరుపై ప్రజలతో మాట్లాడారు. గడప గడపకు వచ్చిన ఆసిఫ్‌కు డివిజన్ ప్రజలు హారతులు ఇస్తూ నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేస్తున్నామని తెలిపారు. డివిజన్‌లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేశామని చెప్పారు. పాత పైపు లైన్లు తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశామని వెల్లడించారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్న తమ పార్టీకే ఓటు అడిగే హక్కు ఉందని వివరించారు. మళ్లీ జగనే సీఎం కావాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. టీడీపీ జనసేన కూటమి ప్రజలకు మాయ మాటలు చెబుతూ ముందుకు వస్తుందని వారిని నమ్మొద్దని కోరారు. చంద్రబాబు ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ధ్వజమెత్తారు.

ముస్లింలను దేశ ద్రోహులుగా చిత్రీకరించిన చంద్రబాబు...

చంద్రబాబు ముస్లిం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారన్నారు. ఆయన అధికారంలో ఉండగా గుంటూరులో నిర్వహించిన నారా హమారా కార్యక్రమంలో ముస్లిం యువకులు తమ సమస్యలు చెబితే వారిని అవమానించారన్నారు. ముస్లిం యువతపై కేసులు నమోదు చేసి దేశ ద్రోహులుగా చిత్రీకరించిన చరిత్ర చంద్రబాబుది అని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంలో కేబినెట్‌లో ఒక్క మైనార్టీకి కూడా స్థానం లేదన్నారు. ఈ రోజు ముస్లిం మైనార్టీలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, కార్పొరేటర్లు వై. చలపతిరావు, పి. చైతన్య రెడ్డి, ఎండీ ఇర్ఫాన్, డివిజన్ కార్యదర్శి డీవీ రెడ్డి, శంకర్, సతీష్ రెడ్డి, పార్టీ నాయకులు నంబూరి ప్రదీప్, విశ్వనాథ్, బూదాల శ్రీనివాసరావు, మండల శీను, మజ్జి శీను, బాజీ బాబా, ఫణి. స్రవంత్, లక్ష్మణ్, వెంకట్, ఏలూరు వెంకన్న, పోలవరపు ఈశ్వరి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న షేక్ ఆసిఫ్, మేయర్ రాయన భాగ్యలక్ష్మి



34 డివిజన్‌లో పట్టాలు పంపిణీ చేస్తున్న ఆసిఫ్, పుణ్యశీల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):పేదల సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేశారని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని 43వ డివిజన్‌లో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. మేయర్ రాయన భాగ్యలక్ష్మీ , కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డితో కలిసి 245 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. మహిళల పేరు మీదే ఇళ్ల పట్టాలు జారీ చేశారన్నారు. లబ్ధిదారులంతా వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలన్నారు. కార్పొరేటర్ హర్షద్, సచివాలయాల అడ్మిన్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): వైఎస్సార్ సీపీ చేపడుతున్న అనేక సంక్షేమ పథకాల అమలు చూసి చంద్రబాబు ఓర్వలేకపోతున్నారని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజక వర్గ సమన్వయకర్త షేక్.ఆసిఫ్ తెలిపారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 34, 35వ డివిజన్‌లో గురువారం నిర్వహించిన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, కార్పొరేటర్ బండి నాగేంద్ర పుణ్యశీల, 35వ డివిజన్ కార్పొరేటర్ బలసాని మణిమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా 34వ డివిజన్ లో 843 మంది, 35వ డివిజన్ పరిధిలో 1394 మందికి రిజిస్ట్రేషన్ చేయించిన ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.శరత్‌బాబు, కార్పొరేటర్లు చైతన్యరెడ్డి, మల్లాది శివ, సుబ్బయ్యశాస్త్రి, మాబు, వీర్రాజు, సుజాతదాసు, సంగీతబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్ల నిర్మాణానికి కొబ్బరికాయ కొడుతున్న హయాత్, చిత్రంలో కార్పొరేటర్ రెహమతున్నీసా

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా గురువారం కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్ సమీపంలోని సీఎస్ఐ చర్చి వద్ద అంతర్గత వీధుల్లో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, అదే విధంగా కుమ్మరిపాలెం సెంటర్ వద్దగల లోటస్ అపార్ట్‌మెంట్స్ దగ్గర రూ.4 లక్షల వ్యయంతో కల్వర్ట్ నిర్మాణం, హిందూ శ్మశానవాటిక ప్రహరీకి ఆనుకుని ఉన్న లోటస్ అపార్ట్‌మెంట్‌వాసులకు ఇబ్బంది లేకుండా రూ.3 లక్షల వ్యయంతో రేకులతో ఎత్తు పెంచే పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించిన నేపథ్యంలో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. విజయవాడ నగరాభివృద్ధిపై సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ పెట్టటమే కాకుండా అందుకు అవసరమైన నిధులూ విడుదల చేశారని తెలిపారు. ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేయటమే కాకుండా ప్రతి సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్, డివిజన్ పార్టీ నాయకులు మంటి కోటేశ్వరరావు, ఎద్దు సురేష్, గోమతోటి వినోద్ పాల్, మంటి రాము, బాషా తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి పర్వదినానికి ఏర్పాట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో శుక్రవారం జరిగే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాట్లు చేస్తున్నారు. దుర్గాఘాట్‌లో పవిత్ర స్నానాలను ఆచరించే భక్తులు ఆపై పాతశివాలయంలోని మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకోవడం పరిపాటి. అందులో భాగంగా దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. కెనాల్ రోడ్డు నుంచి నల్లమందు వీధి మీదుగా ఆలయంలోకి క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అందుకోసం పెద్ద ఎత్తున బారికేడింగ్ సామాగ్రిని తీసుకొచ్చి ఆలయం లోపల సైతం పటిష్టంగా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వివిధ సంస్థలు, దాతల సాయంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో విస్తృతంగా బందోబస్తును ఏర్పాటు చేశారు. శ్రీదర్వేశ్వరస్వామి వారి దేవస్థానం, పంజా సెంటర్ సమీపంలోని హనుమత్ ఆలయంలో వేంచేసి ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం, రామ్‌గోపాల్‌సత్రంలోని విశ్వేశ్వరస్వామి వారి ఆలయం, కేటీరోడ్డులోని రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానం (గంగానమ్మ దేవస్థానం), కొత్తపేట ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానం తదితర ఆలయాల్లోనూ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఏఈవోలు, సూపరింటెంటెంట్లను అంతర్గత బదిలీ చేస్తూ ఈవో కెఎస్.రామారావు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఏఈవో బి.వెంకట రెడ్డిని అన్నదానం, దేవాలయాల భూములు, లీజెస్, లీగల్ విభాగాల నుంచి అన్నదానం బాధ్యతల నుంచి తప్పించి దేవాలయ భూములు, లీజెస్, లీగల్ విభాగాలకే పరిమితం చేశారు. ఏఈవో చంద్రశేఖర్‌ను పరిపాలనా విభాగం, వేద పాఠశాల, ప్రొవిజన్ స్టోర్స్, శానిటేషన్, సెక్యూరిటీ విభాగ పర్యవేక్షణ బాధ్యతల నుంచి అన్నదానం, ప్రసాదాల తయారీ, శానిటేషన్, వేద పాఠశాల బాధ్యతలు అప్పగించారు. ఏఈవో ఎస్. రమేష్‌బాబును ఫెస్టివల్, పూజలు, మెయిన్ టెంపుల్, సబ్ టెంపుల్, ప్రసాదం తయారీ, ట్రస్ట్ బోర్డు బాధ్యతల నుంచి పరిపాలనా విభాగం, ప్రొవిజన్స్ స్టోర్స్, ఫెస్టివల్, పూజలు,మెయిన్ టెంపుల్, సబ్ టెంపుల్, ట్రస్ట్ బోర్డుతో పాటు సెక్యూరిటీ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సూపరింటెంటెంట్ వై. హేమదుర్గాంబను మెయిన్ స్టోర్స్, పూజలు, ఫెస్టివల్, ధర్మపథం నుంచి అన్నదానానికి బదిలీ చేశారు. కేవీ దుర్గాప్రసాద్‌ను అన్నదానం, కొండ దిగువన కౌంటర్ల పర్యవేక్షణ నుంచి అకౌంట్స్ విభాగానికి బదిలీ చేశారు. పి.సునీతకు అకౌంట్స్, స్టేషనరీ నుంచి స్టేషనరీ, ఎంపీ ఫామ్స్, ఆర్‌టీఐ యాక్ట్, పూజలు, ఫెస్టివల్ విభాగాలకు బదిలీ చేశారు. పి.భాగ్యజ్యోతిని ఆడిట్, జనరల్, శారీస్ , సబ్ టెంపుల్ నుంచి మెయిన్ స్టోర్స్, ఆడిట్, జనరల్, శారీస్ విభాగాకి బదిలీ చేశారు. కె. శ్రీనివాసరావు ప్రస్తుతం నిర్వహిస్తున్న శానిటేషన్, దత్తత దేవాలయాల, కొండపైన ప్రసాదం కౌంటర్ల పర్యవేక్షణకు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వాటిలో అన్ని విభాగాలు యథాతథంగా ఉంచి ప్రసాదం కౌంటర్ల పర్యవేక్షణ బాధ్యతలను తప్పించారు.

ఆర్థిక ప్రగతికి మహిళల ముందడుగే కీలకం



కేక్ కట్ చేసి మహిళా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకురాళ్లు, కార్యకర్తలకు శుభాకంక్షలు తెలుపుతున్న ఆసిఫ్



సత్కారం పొందిన వారితో నిర్వాహకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మహిళల ముందడుగే కీలకమని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం గొల్లపూడి బైపాస్ రోడ్‌లోని పార్టీ పశ్చిమ కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత కేక్ కట్ చేసిన ఆసిఫ్ మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా రాణించగలరని చెప్పారు. ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ, ఏపీ సంగీత, నృత్య అకాడమీ డైరెక్టర్ బట్టిపాటి సంధ్యారాణి, కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, పడిగపాటి చైతన్యరెడ్డి, మైలవరపు రత్నకుమారి, అత్తలూరి ఆదిలక్ష్మి, బలసాని మణెమ్మ, పార్టీ నాయకురాలు బంకా చాముండేశ్వరి, పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసిఫ్ అందరికీ శాలువాలు కప్పి సత్కరించారు.

మహిళా కార్మికులకు సత్కారం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఆవరణలోగల మినిస్టీరియల్ అండ్ ఆల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ హాల్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని తెలిపారు. మహిళా కార్మికులను సత్కరించారు. నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ.మహేష్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పీ రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, జోనల్ కమిషనర్ – 1 రమ్య కీర్తన, సెక్రటరీ వసంతలక్ష్మి, అకౌంట్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.


రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం రైల్వే ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ప్రపంచంలోనే అధిక సంఖ్యలో ఉద్యోగులు ఉండే సంస్థల్లో భారతీయ రైల్వే ఒకటి అన్నారు. మహిళా సాధికారత కోసం రైల్వేశాఖ ఎప్పుడు ముందుంటుందని చెప్పారు. విజయవాడ డివిజన్‌లో అన్ని విభాగాల్లోనూ మహిళా ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ వారి సమమర్ధతను చాటుకోవడం డివిజన్‌కే గర్వకారణం అని కొనియాడారు. డివిజన్‌లో 1750 మంది మహిళా ఉద్యోగులు లోకో పైలట్‌లు, టెక్నీషియన్‌లు, క్లర్కులు, గార్డులు, ఇంజినీరింగ్‌తో పాటు ఇతర అన్ని శాఖల్లో తమ సత్తా చాటుతున్నారని చెప్పారు. అనంతరం ఆయా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏడీఆర్ఎంలు ఎం.శ్రీకాంత్, పి.డి ఎడ్విన్, సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్, పలు బ్రాంచ్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆవరణలో మహిళా దినోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మేదరమెట్ల మంజుభార్గవి మాట్లాడుతూ మహిళలకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ఏ రంగంలోనైనా రాణించగల సత్తా మహిళలకు ఉందని చెప్పారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన అధ్యాపకులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి పి. లక్ష్మణస్వామి, ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల విజయం

మహిళలు అన్ని రంగాల్లోనూ విజయాలు సాధిస్తున్నారని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఉమాదేవి అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, కేబీఎన్ కళాశాల ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఆ కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మహిళలు వివిధ రంగాల్లో చక్కని ప్రతిబను ప్రదర్శిస్తున్నారని చెప్పారు. కార్పొరేటర్ బోయి సత్యబాబు ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడారు. వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలను నిర్వాహకులు సత్కరించారు. డిస్ట్రిక్ట్ లీగల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కొడాలి, సీడబ్ల్యూసీ సభ్యురాలు అనూరాధ, సీహెచ్ రాధాకుమారి, సైకాలజిస్ట్ కృష్ణకుమారి, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, ఉమెన్ స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ, అధ్యాపకురాలు కల్మబేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్దీపకాంతులతో ఇంద్రకీలాద్రి



విద్యుద్దీపకాంతులతో వెలుగుతున్న ఆలయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి ఉత్సవాలకు ఇంద్రకీలాద్రి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయంతో పాటు మల్లేశ్వర స్వామి వారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. మహా శివరాత్రి శుక్రవారం రావడంతో అమ్మవారిని, మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయం ఇటీవల పునర్నిర్మాణం పూర్తి చేసుకోవడంతో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపించుకునేందుకు భక్తులు భారీగా తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు స్వామి వారి ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించేందుకు అవసరమైన పనులు పూర్తయ్యాయి. మహా శివరాత్రిని పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి స్వామి వారికి విశేష అభిషేకాలు, త్రికాల అర్చనలు జరుగుతాయి. రాత్రి 9–30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు దివ్య లీలా కళ్యాణోత్సవం నిర్వహించను న్నారు.

స్వాములకు మంగళస్నానాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):మహా శివరాత్రిని పురస్కరించుకుని భీమనవారిపేటలోని విజయ దుర్గా రామలింగేశ్వరస్వామి వారి సన్నిధిలో గురువారం కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు ఆది దంపతులకు మంగళస్నానాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పూజలు జరిపించారు. జాగు బాబూరావు, శ్రీలక్ష్మి దంపతులు తమ్మిన సతీష్, వాణి దంపతులు, ఆకుల శ్రీనివాసరావు, రాజేశ్వరి దంపతుల చేతుల మీదగా పసుపు కొట్టే కార్యక్రమం, స్వామి వారిని అమ్మవారిని పెళ్లికుమారుడు, పెళ్లి కుమార్తెగా అలంకరించారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

బీబీఏ అధ్యక్షుడు కేబీ సుందర్

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన కోసం విజయవాడకు చెందిన ఏబీసీడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్లోని విద్యార్థులకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రచించిన 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకాలను పంపిణీ చేశారు. గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ది బెజవాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేబీ సుందర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం అమలు ద్వారా భారత దేశం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా విలసిల్లుతుందని తెలిపారు. యావత్ ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తుందంటే అందుకు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే కారణమని పేర్కొన్నారు. అటువంటి శక్తివంతమైన రాజ్యాంగంపట్ల ప్రతి విద్యార్థీ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సమాజంలో అసమానతలను తొలగించేందుకు అంబేడ్కర్ చేసిన కృషిని స్ఫూర్తిగా తీసువాలన్నారు. కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వి.రాజారత్నం, కృష్ణా జిల్లా ప్రెసిడెంట్ వి.కోటేశ్వరరావు, అడ్వకేట్లు కేజెఎస్ ప్రకాశరావు, ఆవుల వెంకటరావు, పాఠశాల కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ, స్కూల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ ఆర్.గోపాలం, సెక్రటరీ ఎం.నరసింహారావు, ట్రెజరర్ డి.నాగేశ్వరరావు, హెచ్ఎం డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

డాక్యుమెంట్ పోయినవి

ఆత్మకూరి వెంకటేశ్వరరావు, S/o. రామమూర్తి, డోరు నెం. 31-9-11ఏ/1, ఫ్లాట్ నెం. FF-1, ... మా పేరుమీద ఉన్న Martin and Harris Laboratories Ltd. ఒరిజినల్ షేర్ సర్టిఫికెట్స్ (ఫోలి నెం.1415) ... పోయినవి. ... సెల్: 7893330857









